భూమికి పరీక్ష.. రైతుకు రక్ష

- మట్టి నమూనాల సేకరణకు అనువైన సమయం
- పరిమితికి మించి ఎరువులు వాడితే దిగుబడులపై ప్రభావం
- భూసారం బాగుంటేనే పంటలు ఆశాజనకం
- ఆర్‌ఎస్‌కేల సాయంతో పరీక్షలు


కాపవరంలో మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయ సిబ్బంది

రాజానగరం: పంట భూముల్లో ఇష్టానుసారంగా సాగు చేయడం వల్ల భూసారం తగ్గే అవకాశం ఉంది. ఈ కారణంగా ప్రతి రైతు తమ భూముల్లో మట్టి నమూనాలు తీసి, భూసార పరీక్ష చేయించడం శ్రేయస్కరమని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. దీంతో ఏ పంటలకు, ఏ మోతాదులో ఎరువులు వాడవచ్చు, ఏ సమయాల్లో ఎలాంటి సస్యరక్షణ చర్యలు చేపట్టవచ్చనే విషయాలను తెలుసుకునేందుకు అవకాశం ఉంటుంది. 2014–15 నుంచి మట్టి నమూనాలు సేకరించి, భూసార పరీక్షలు చేస్తున్నారు. వాటి ఆధారంగా రైతులకు కార్డులు అందజేశారు. భూసార పరీక్ష నివేదికను అనుసరించి ఆయా భూముల్లో ఏ పంటలు పండించవచ్చు, ఏ ఎరువులు వాడవచ్చనే విషయాలను కూడా అందులో వివరించారు. అప్పటి నుంచి అనేక మంది రైతులు వాటిని అనుసరిస్తున్నారు. నియోజకవర్గంలో మొత్తం 17,450 హెక్టార్లలో పంట సాగవుతోంది. ఇందులో రాజానగరం మండలంలో 6,450 హెక్టార్లు, కోరుకొండలో 5,750, సీతానగరం మండలంలో 5,250 హెక్టార్లలో రైతులు వ్యవసాయం చేస్తున్నారు.

ఇష్టానుసారం ఎరువులు వాడితే..

సాధారణంగా చాలా మంది రైతులు తమ పొలాల్లో అధిక దిగుబడులు సాధించాలన్న ఉద్దేశంతో ఇష్టానుసారంగా రసాయన ఎరువులను వాడుతుంటారు. దీనివల్ల పెట్టుబడులు పెరగడమే కాకుండా, చీడపీడలు కూడా విస్తరించి, పంట దిగుబడులు తగ్గే అవకాశాలున్నాయి. అందువల్ల పోషకాల సమతుల్యతను పాటించడానికి, రసాయన ఎరువులు సరైన మోతాదులో వాడటానికి భూసార పరీక్షల ఆవశ్యకత ఎంతో దోహదపడుతుందంటున్నారు. ప్రతి రైతు తమ పొలంలో ఏదో ఒకటి పండిస్తున్నామని అనుకోకుండా, భూసార పరీక్షలు చేయించి, ఏ పంటలు అనువైనవో, ఏ ఎరువులు వాడితే మంచి దిగుబడులు వస్తాయో తెలుసుకోవడం ముఖ్యం.

సూక్ష్మ పోషకాలు లోపించకుండా..

వ్యవసాయం చేసే ప్రతి రైతు సాగు చేసే పంటల్లో సూక్ష్మ పోషకాలు లోపించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. సూక్ష్మ పోషకాలుగా పిలిచే జింకు, బోరాన్, జిప్సమ్ (కాల్షియం, గంధకం) పంటల్లో లోపిస్తే దిగుబడులు గణనీయంగా తగ్గుతాయి. ఈ లోపాన్ని గుర్తించి, సకాలంలో వాటిని వేసి దిగుబడులు పెంచుకోవచ్చు. ఖరీఫ్ సాగుకు ముందుగానే ప్రతి రైతు తమ పొలాల్లో సూక్ష్మ పోషకాల లోపాలను గుర్తించి, తదనుగుణంగా చర్యలు తీసుకోవడం మంచిదని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఇందుకు 50 శాతం రాయితీపై రైతులకు సూక్ష్మ పోషకాలను వ్యవసాయ శాఖ ఆర్‌ఎస్‌కే(రైతు సేవా కేంద్రం)ల ద్వారా సరఫరా చేస్తోంది.

రైతులు కోరితే పరీక్షలు చేయిస్తాం

ప్రస్తుతం ఎక్కడైనా రైతులు కోరితేనే మట్టి నమూనాలు తీసుకుంటున్నాం. ఎవరికైనా వీటిపై ఆసక్తి ఉంటే సమీపంలోని ఆర్‌ఎస్‌కేని సంప్రదించాలి. అప్పై మట్టి నమూనాలు తీసుకుని, భూసార పరీక్షలు చేయించవచ్చు. అనంతరం వాటికి సంబంధించిన కార్డులను అందజేస్తారు. ఆయా భూముల సారవంతానికి సంబంధించిన వివరాలు ఉంటాయి. భూసారం బాగుంటేనే దిగుబడులు బాగుంటాయనే విషయాన్ని రైతులు గ్రహించాలి. వేసవిలో పచ్చిరొట్ట వంటి భూసారాన్ని పెంచే వాటిని సాగు చేసి, వేసవి దుక్కులు చేయడం మంచిది.

– షేక్ ఇమామ్ ఖాసిమ్, వ్యవసాయాధికారి, రాజానగరం

క్లుప్తంగా

ఘనంగా మాచరమ్మ తీర్థం


ప్రత్యేకాలంకరణలో మాచరమ్మ అమ్మవారు

పెదపూడి: ప్రసిద్ధి చెందిన గ్రామంలోని మాచరమ్మ వారి తీర్థ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ తీర్థ మహోత్సవానికి మండలవ్యాప్తంగా భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అమ్మవారిని దర్శించుకుని, మొక్కుబడులు చెల్లించారు. అమ్మవారి దర్శనానికి ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. స్థానిక పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఆదిత్యునికి పంచామృతాభిషేకం


ప్రత్యేక అలంకరణలో ఆదిత్యుడు, దేవేరులు

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలోని ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత ఆదిత్యుని దర్శనానికి ఆదివారం భక్తులు విశేష సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రధానార్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు, వ్రత పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు ఆలయ కమిటీ వారు తీర్థ ప్రసాదాలు, అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

డీసీసీ సెక్రటరీగా లోవరాజు

బిక్కవోలు: గ్రామానికి చెందిన దాసరి లోవరాజు డీసీసీ సెక్రటరీగా నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి తనకు నియామకపత్రం అందించినట్టు లోవరాజు ఆదివారం తెలిపారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి తీవ్ర గాయాలు


క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో తరలిస్తున్న సిబ్బంది

సీతానగరం: మండలంలోని వంగలపూడి వద్ద మోటారు సైకిల్ అదుపుతప్పడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఆదివారం మధ్యాహ్నం వంగలపూడికి చెందిన 27 ఏళ్ల ఆకుమూరి జోషి మోటారు సైకిల్‌పై సీతానగరం బయలుదేరాడు. వంగలపూడి ఏటిగట్టుపై ఇసుక ఉండటంతో మోటారు సైకిల్ అదుపుతప్పి పడిపోయింది. ఈ ఘటనలో జోషి తల, ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఇచ్చిన సమాచారంతో 108 అంబులెన్స్‌లో ఈఎంటీ ముత్యం శ్రీనివాస్, పైలట్ లక్ష్మణ్ అతడికి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఎస్సైగా సత్యనారాయణ బాధ్యతల స్వీకరణ



రాజానగరం: కొత్త ఎస్సైగా ఏకే సత్యనారాయణ ఆదివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు బొమ్మూరు పోలీసు స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వర్తించిన ఆయన పదోన్నతిపై రాజానగరం బదిలీ అయ్యారు.

మాజీ మంత్రిపై సీఐ ప్రవర్తన అనుచితం

వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొండపల్లి

కోరుకొండ: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నేత విడదల రజనీపై చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బనాయుడు అనుచిత ప్రవర్తనను పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు కొండపల్లి దుర్గారావు ఖండించారు. ఆదివారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. సీఐ సుబ్బానాయుడు రజనీని కారు నుంచి లాగి, తోసివేసి, సంస్కారం లేకుండా ప్రవర్తించడాన్ని తప్పుపట్టారు. రాష్ట్రంలో పోలీసులు అంబేడ్కర్ రాజ్యాంగాన్ని కాకుండా, రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అనుసరిస్తున్నారని దుయ్యబట్టారు. నడిరోడ్డుపై సీఐ సుబ్బనాయుడు బరితెగించి వ్యవహరించిన తీరు అప్రజాస్వామికమన్నారు.

12 నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

రంగంపేట: ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 12వ తేదీ నుంచి జరుగుతాయని రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, చీఫ్ సూపరింటెండెంట్ బి.హేమ తెలిపారు. ఆదివారం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, 12 నుంచి 19 వరకు జరిగే ఈ పరీక్షలకు 344 మంది విద్యార్థులు హాజరవుతారని చెప్పారు. ఈ పరీక్షలకు జనరల్, ఒకేషనల్ విద్యార్థులు హాజరువుతారన్నారు.

33 ఏళ్ల తర్వాత.. కలసిన స్నేహం


కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

కోరుకొండ: కోరుకొండ రాజబాబు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1992–93 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు 33 ఏళ్ల తర్వాత ఆదివారం కలుసుకున్నారు. మండలంలోని బూరుగుపూడి జంక్షన్ నాగసాయి ఫంక్షన్ హాల్‌లో జరిగిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో వారి అనుభూతులను నెమరువేసుకున్నారు. మొత్తం 120 మంది విద్యార్థులు వివిధ శాఖల్లో ఉన్నత ఉద్యోగాలు, వ్యాపారాల్లో స్థిరపడ్డారు. ఆంధ్రా, తెలంగాణ, ఒడిశా, తమిళనాడు, గుజరాత్ తదితర రాష్ట్రాల్లో పనిచేస్తున్నారు. ఈ సమ్మేళనంలో వీరంతా ఆటపాటలతో సందడి చేశారు. తొలుత తమను బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, వివేకానందం, పీవీ సుబ్బారావు, వల్లభరావు, వీరభద్రరావు, పూర్వ విద్యార్థులు సూరిసెట్టి కుటుంబరావు, అడపా వీరబాబు, దుర్గారావు, దివాకర్, మాధవి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతా రాహిత్యమే అభద్రతకు మూలకారణం

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ సూర్యనారాయణరెడ్డి



అనపర్తి: నియోజకవర్గ ప్రజాప్రతినిధిగా ఉంటూ, బాధ్యత లేకుండా అధికారులపై ఒత్తిడి తెచ్చి మరీ చేస్తున్న దుష్ప్రచారమే బిక్కవోలు మండలం బలభద్రపురం గ్రామస్తులు అభద్రత భావానికిలోనై బిక్కుబిక్కుమంటూ బతకడానికి కారణమైందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజవర్గ కో–ఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తి పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ, వైద్య పరీక్షల కోసం తన వద్దకు వచ్చిన గర్భిణి అత్తవారింటికి బలభద్రపురం వెళ్లడానికి భయపడుతున్నానని చెప్పిన కారణం విని తాను నిర్ఘాంతపోయానన్నారు. క్యాన్సర్ ఉధృతంగా ఉందని స్వయంగా ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ప్రచారం చేయడంతో, అక్కడి నీరు, గాలి వల్ల తనకు, తన బిడ్డకు ఏమవుతుందోనన్న ఆందోళనతో ఆ గ్రామం వెళ్లాలంటేనే భయమేస్తుందని ఆమె వాపోయిందన్నారు. స్వయంగా రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి, జిల్లా కలెక్టర్‌తో పాటు, రాష్ట్ర, కేంద్ర వైద్య బృందాలు సైతం సాధారణ స్థాయిలోనే పరిస్థితులు ఉన్నాయని ధ్రువీకరించాయని గుర్తు చేశారు. ఇంకా కొన్ని ఎల్లో పత్రికలు, ఎమ్మెల్యే ఏదో ఆశించి ఈ ప్రచారానికి తెరతీశారని, వారి స్వార్థానికి బలభద్రపురం గ్రామాన్ని బలి చేస్తున్నారంటూ ఆయన ఆరోపించారు. గ్రామంలో పరిస్థితులు బాగానే ఉన్నాయని రాష్ట్ర మంత్రి, జిల్లా కలెక్టర్, ధ్రువీకరించిన నేపథ్యంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు.

విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవాలి


విజేతలకు బహుమతులు అందజేస్తున్న త్రిమూర్తులు తదితరులు

పెదపూడి: విద్యార్థి దశ నుంచి విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకుని, ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుకోవాలని కరకుదురు గ్రామం సేవకీయం ట్రస్ట్ వైస్ చైర్మన్ పాటంశెట్టి త్రిమూర్తులు అన్నారు. కరకుదురు గ్రామంలో వేణుగోపాల స్వామి ఆలయంలో సేవకీయం ట్రస్ట్, వేణుగోపాల సత్సంగం వారు పది రోజులుగా 50 మంది చిన్నారులకు చిత్రలేఖనం, ఆధ్యాత్మికతపై వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో విజేతలకు ఆదివారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా త్రిమూర్తులు మాట్లాడుతూ, వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వేణుగోపాలస్వామి ఆలయ ధర్మకర్త యెంద్రు వెంకటసుబ్బారావు, అర్చకుడు వాడపల్లి శేషాచార్యులు, కనకదుర్గ దేవి ఆలయ ధర్మకర్త టి.శ్రీను, వారాహి మహిళా మండలి అధ్యక్షురాలు పాటంశెట్టి కాశీరాణి, నున్న లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారామాంజనేయ విగ్రహ ప్రతిష్ఠ


విగ్రహ ప్రతిష్ఠలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న జక్కంపూడి రాజా


పందుళ్లమ్మ జాతరలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం నాలుగు బొమ్మల సెంటర్ వద్ద సీతారామాంజనేయ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా హాజరై, స్వామివారి విగ్రహాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వామివారి కరుణాకటాక్షాలు ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, వైస్ ఎంపీపీ–1 ముదునూరి సురేష్‌రాజు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కోండ్రపు ముత్యాలు, మండల కన్వీనర్ గంటా శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి వలవల వెంకట్రాజు (తోటలోరాజు), ఎంపీటీసీ వెన్నెల అప్పలనాయుడు, మట్ట వసంతరావు, వలవల వలీ, మట్ట సూరిబాబు, పువ్వాడ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పందుళ్లమ్మ జాతర

కోరుకొండ: శ్రీరంగపట్నం గ్రామ దేవత పందుళ్లమ్మ జాతర మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా దర్శించుకున్నారు. నియోజకవర్గంలోని ప్రజలందరినీ కష్టాల నుంచి కాపాడాలని, అమ్మవారి కృపాకటాక్షాలు ప్రజలందరిపైనా ఉండాలని ప్రార్థించానన్నారు. ఉత్సవాల్లో ప్రముఖులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం


గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరంలోని గ్రంథాలయంలో ఆదివారం వేసవి విజ్ఞాన తరగతులను లైబ్రేరియన్ టి.అరుణ్‌కుమార్ నిర్వహించారు. విద్యార్థులకు కథలు చెప్పడం, పుస్తక పఠనం, పుస్తక సమీక్ష నిర్వహించారు. విద్యార్థులతో కలర్స్ పెయింటింగ్ వేయించారు. గ్రంథాలయంలో మంచి పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని లైబ్రేరియన్ అరుణ్‌కుమార్ తెలిపారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


ప్రత్యేకాలంకరణలో వినాయక స్వామి

బిక్కవోలు: మండలంలోని ఊలపల్లి గ్రామం వేలంపేటలో ఉన్న వినాయక ఆలయం ద్వితీయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భారీఎత్తున అన్న సమారాధన జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

వీర జవాన్లకు మద్దతుగా ర్యాలీ


ధవళేశ్వరంలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న యువకులు

ధవళేశ్వరం: భారత్–పాకిస్తాన్ యుద్ధంలో అమరులైన వీరజవాన్లకు మద్దతుగా ధవళేశ్వరంలో గ్రామ ప్రముఖుడు తలారి మూర్తి ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. ధవళేశ్వరం సాయిబాబా గుడి నుంచి ప్రారంభమైన ర్యాలీ స్థానిక కాటన్ బ్యారేజ్ సెంటర్ వరకు సాగింది. గ్రామంలో యువకులు అధిక సంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు. కొవ్వొత్తులు వెలిగించి వీర జవాన్లకు మద్దతుగా పెద్దఎత్తున నినాదాలు చేశారు.


కాగడాలు వెలిగిస్తున్న చిన్నారులు


అమ్మవారిని ఊయల ఊపుతున్న భక్తులు


కేరళ వాయిదాలతో కళాకారులు

భక్తిశ్రద్ధలతో కట్లమ్మ జాతర


ఆకట్టుకున్న శక్తి వేషధారులు


పొన్ను వేస్తున్న భక్తులు


అమ్మవారి జాతరలో గరగ నృత్యాలు

బిక్కవోలు: పందలపాక గ్రామంలో కొలువైన కట్లమ్మ తల్లి జాతర అంగరంగ వైభవంగా జరిగింది. ఆదివారం రాత్రి మూడేళ్ల తర్వాత అమ్మవారి జాతర ఘనంగా నిర్వహించడంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయం వద్ద చిన్నారులు కాగడాలు వెలిగించారు. అనంతరం గరగ నృత్యాలు, తీన్మార్, శక్తివేషాలు, బ్యాండ్‌మేళాలు, డీజే సౌండ్స్, కేరళ వాయిద్యాలు, కోయడ్యాన్సులు, మిరుమిట్లు గొలిపే బాణసంచా కాల్పులు ఆకట్టుకున్నాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీఎత్తున పోలీసు బందోబస్తు నిర్వహించారు.